# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖపట్నంలో రేపు ఉదయం జరగనున్న అంతర్జాతీయ నావికాదళ సమీక్షకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో కలిసి "భారత్ - ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్"ను ప్రారంభించారు.
- ❖ రాబోయే రెండేళ్లలో దేశపు ఏఐ ఎకో సిస్టమ్ లో 200 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు రావచ్చని భావిస్తున్నామని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు.
- ❖ "భారత్ విస్తార్" డిజిటల్ యాప్‌ను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ జైపూర్‌లో ఈరోజు ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం వేదికగా జరగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్-2026)కు ముఖ్య అతిధిగా హాజరయ్యేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సాయంత్రం నగరానికి చేరుకున్నారు. వాయుమార్గం ద్వారా ఢిల్లీ నుండి భారతీయ వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో విశాఖ నేవల్ ఎయిర్ స్టేషన్ INS డేగా కు చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్వాగతం పలికారు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ రేపు జరుగనుంది. సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లాంఛనప్రాయ నౌకాదళ విన్యాసాలను సమీక్షిస్తారు. భారతదేశపు నావికా శక్తిని సముద్ర తీర సామర్థ్యాల అద్భుతమైన ప్రదర్శనను వీక్షిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్ కు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ముంబైలోని లోక్ భవన్‌లో ఈరోజు సమావేశమయ్యారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంస్కృతిక మార్పిడితో సహా కీలక రంగాలలో భారత్ - ఫ్రాన్స్ మధ్య వ్యూహాత్మక సహకారంపై ఇరువురు నేతలు ఈ

సందర్భంగా చర్చించారు. అనంతరం ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో కలిసి "భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్"ను ప్రారంభించారు. 2026 సంవత్సరాన్ని "భారత్-ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరం"గా జరుపుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. అంతకుముందు జరిగిన సంయుక్త పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. క్రిటికల్ మినరల్స్, బయోటెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ వంటి కీలక రంగాలలో రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడానికి వీలుగా ఇండో-ఫ్రెంచ్ సెంటర్ ఫర్ AIని ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే రెండేళ్లలో దేశపు ఏఐ ఎకో సిస్టమ్ లో రెండు వందల బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు రావచ్చని భావిస్తున్నామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్-2026పై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ… ఈ AI శిఖరాగ్ర సమావేశానికి భారీ స్పందన లభిస్తోందని, దేశంలోని నలు మూలల నుండి ప్రజలు వస్తున్నారని చెప్పారు. కృత్రిమ మేధస్సు (AI) అనేది ఐదవ పారిశ్రామిక విప్లవం అని ఆయన అభివర్ణించారు. మానవాళి ప్రయోజనం కోసం సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏ.ఐ.ను రూపొందించేందుకు దేశాలన్నీ ఈ వేదిక ద్వారా ఏకమవుతున్నాయని చెప్పారు. అదే విధంగా ఐటీ రంగం దేశానికి అమూల్యమైన ఆస్తి అని సాంకేతిక మార్పుల సమయంలో పరిశ్రమలు–విద్యా సంస్థలు–ప్రభుత్వం మధ్య సమన్వయం అత్యవసరమన్నారు. ప్రస్తుతం రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్, భవిష్యత్ సాంకేతికతలకు యువతను సిద్ధం చేయడంపై కలిసి పని చేస్తున్నామని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైతుల కోసం "భారత్ విస్తార్" డిజిటల్ యాప్‌ను కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ జైపూర్‌లో ఈరోజు ప్రారంభించారు. డిజిటల్ ఇండియా విజన్‌లో భాగంగా ఈ యాప్ రైతులకు సాధికారిత కల్పించడంతో పాటూ.. వారి ఆదాయాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని ఈ సందర్భంగా శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. వ్యవసాయ రంగంలో డిజిటల్ విప్లవం వైపు ఇది ఒక చారిత్రాత్మక అడుగుగా అభివర్ణించారు. రైతులు పంట ఆధారిత శాస్త్రీయ సలహా సేవలు, మద్దతు ధరలు, వాతావరణ సమాచారాన్ని "భారత్ విస్తార్" ద్వారా ఒకే ఫోన్ కాల్‌తో పొందవచ్చని చెప్పారు. డిజిటల్ ఇండియా దార్శనికతను గ్రామీణ భారతదేశానికి విస్తరించడంలో ఈ చొరవ నిర్ణయాత్మకంగా ఉంటుందని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని మంగళగిరి ఎయిమ్స్ రెండవ స్నాతకోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తీర్ణులైన వైద్య విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం అనుప్రియ పటేల్ మాట్లాడుతూ…. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక వైద్య పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సారి బడ్జెట్ లో వైద్య రంగానికి అధికంగా

నిధులు కేటాయించడం జరిగిందన్నారు. వైద్య విద్య పూర్తి చేసుకున్న ప్రతీ విద్యార్థి సేవా దృక్పథం, మానవత్వంతో ఆరోగ్య సేవలందించాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ పొరుగు దేశమైన బంగ్లాదేశ్ నూతన ప్రధానమంత్రిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (BNP) ఘన విజయం సాధించడంతో ఈరోజు ఉదయం తారిఖ్ రెహమాన్ ను ఆ పార్టీ పార్లమెంటరీ నాయకుడిగా ఎన్నుకున్నారు. తారిక్ రెహమాన్ తో అధ్యక్షుడు మొహమ్మద్ షాబుద్దీన్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది విదేశీ ప్రముఖులతో పాటు భారత్ తరపున లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం తారిఖ్ రెహమాన్ ను  ఓంబిర్లా మర్యాదపూర్వకంగా కలిశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ నుండి ఆస్ట్రేలియా జట్టు గ్రూప్ దశలోనే వైదొలిగింది. శ్రీలంకలోని పల్లకెలెలో ఈరోజు జరగాల్సిన జింబాబ్వే - ఐర్లాండ్ గ్రూప్-B మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో పాయింట్ల పట్టికలో నాల్గవ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా టోర్నమెంట్ నుండి వైదొలగాల్సి వచ్చింది. దీంతో గ్రూప్-B నుంచి శ్రీలంకతో పాటూ.. జింబాబ్వే కూడా సూపర్ 8కు అర్హత సాధించింది. మిగతా గ్రూపుల నుండి ఇప్పటికే భారత్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్లు సూపర్ 8కు చేరుకున్నాయి. మిగిలిన ఒక్క స్థానం కోసం నెదర్లాండ్స్, పాకిస్థాన్, అమెరికా జట్లు పోటీ పడుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 277 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 173 పాయింట్ల లాభంతో 83 వేల 450 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 42 పాయింట్లు లాభపడి 25 వేల 725 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =